

ఆకట్టుకున్న అఖండ

- అంతరాష్ట్ర బండలాగుడు పోటీల్లో పాల్గొన్న వృషభం
- చూసేందుకు తరలి వచ్చిన జనాలు



ఎమ్మిగనూరులో జరిగిన ఎద్దుల బలప్రదర్శన పోటీల్లో పాల్గొన్న అఖండ సినిమాలో నటించిన ఎద్దు బసవ

ఎమ్మిగనూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నీలకంఠే శ్వర జాతర సందర్భంగా నిర్వహించిన ఒంగోలు ఎద్దుల బల ప్రదర్శన పోటీల్లో అఖండ సినిమాలో కనిపించిన వృషభం బసవ ఆదివారం ఆకట్టుకుంది. అరుణాచలంలో ఈ ఎద్దు దాదాపు నెల రోజులు షూటింగ్‌లో పాల్గొన్నట్టు తెలిసింది. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం మూదేడు గ్రామానికి చెందిన రైతు ఈ ఎద్దును ఏడెనిమిదేళ్ల క్రితం గార్లదిన్నె సంతకు తీసుకొచ్చారు. టీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా డెవలప్ మెంట్ అధినేత తోట శ్రీనివాసరావు (గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం కొప్పురావూరు గ్రామం) రూ.1.80 లక్షలకు కొనుగోలు చేశారు. ఆయన తన దగ్గర దాదాపు నాలుగేళ్ల పాటు ఉంచుకొని మరో ఎద్దుతో కలిపి ఆయా రాష్ట్రాల్లో జరిగే ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీల్లో నిలిపేవారు. అలా దాదాపు 30కి పైగా మొదటి బహుమతిని సాధించింది. ఏడాదిన్నర క్రితం తిరిగి అనంతపురం జిల్లా గార్లదిన్నె గ్రామానికి చెందిన రైతు కుమ్మరి రామాంజనేయులు ఆ వృషభాన్ని తోట శ్రీనివాసరావు నుంచి రూ.5.95 లక్షలకు కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 44 పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ బహుమతులను కైవసం చేసుకుంది. అఖండ సినిమాలో నటించిన ఎద్దు బసవ బండలాగుడు పోటీల్లో పాల్గొందని తెలుసుకున్న జనాలు భారీగా తరలి వచ్చారు. ఎద్దు బండలాగే ప్రదేశానికి రాగానే జై బాలయ్య అంటూ కేకలు, ఈలలు వేశారు. కాగా ఈ పోటీల్లో బసవ నాలుగు స్థానంలో నిలిచింది.



బండలాగుడు పోటీల్లో పాల్గొన్న ఎద్దులు

ఎద్దులంటే ఎంతో ఇష్టం

నాకు ఎద్దులంటే చాలా ఇష్టం. ఆరేళ్లుగా ఇలాంటి ఒంగోలు జాతి ఎద్దులను పోషించి పోటీల్లో నిలుపుతున్నా. అఖండ సినిమాలో ఎద్దును కూడా కొనుగోలు చేసి ఎంతో ఇష్టంగా పోషిస్తున్నాను. ఇప్పటి వరకు ఈ ఎద్దు మరో ఎద్దుతో కలిసి 44 పోటీల్లో పాల్గొనగా 26 ప్రథమ స్థానం బహుమతులను కైవసం చేసుకుంది. -కుమ్మరి రామాంజనేయులు, గార్లదిన్నె గ్రామం, అనంతపురం జిల్లా.

అందని వందన



ఆత్మకూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు భరోసాగా నిలిచేలా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన ఆశయం నీరు గారిపోతోంది. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు అందాల్సిన నగదు ప్రయోజనం ఏళ్ల తరబడి కొంతమంది లబ్ధిదారులకు చేరకపోవడం విస్మయానికి గురి చేస్తోంది. అయితే గడిచిన ఎనిమిదేళ్లుగా ఈ సమస్య ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటికీ పరిష్కరించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలోనే 2015లో ప్రపంచ గణాంకాల ప్రకారం ప్రసూతి మరణాల్లో ఐదో వంతు భారత్‌లో చోటు చేసుకోవడంతో దేశవ్యాప్తంగా ఆందోళన కలిగింది. దీంతో ఇందుకు గల కారణాలను అన్వేషించగా చాలా మంది తల్లుల్లో పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలు ఉండటంతో మాతృ శిశు మరణాలు అధికంగా ఉన్నట్లు నిర్ధారించారు. ఈ క్రమంలో గర్భిణులు, బాలింతలకు నగదు ప్రయోజనం కలిగించినప్పుడు కొంత మేర ఈ సమస్యను పరిష్కరించే అవకాశం ఉంటుందని భావించారు. ఇందుకోసం 2017 జనవరి 1వ తేదీన కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన(పీఎంఎంవీవై)ను ప్రవేశపెట్టింది. అయితే ఈ పథకం లబ్ధిదారులకు అందని ద్రాక్షగా మారడంతో ప్రభుత్వ ఆశయానికి తూట్లు పడుతోందన్న విమర్శలు ఉన్నాయి.

- ఎనిమిదేళ్లుగా పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు
- ఉమ్మడి జిల్లాలో పది వేల మందికిపైగా జమకాని నగదు
- పీఎంఎంవీవై 2.0 లోను 897 మందికి పెండింగ్
- కేంద్ర ప్రభుత్వ ఆశయానికి తూట్లు

ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన లక్ష్యాలు ఇవే

మాతృత్వ వందన యోజనలో భాగంగా ప్రసవానికి ముందు తల్లికి విశ్రాంతి ఎంతో అవసరం ఉంటుంది. ఇందుకుగాను వేతన నష్టానికి నగదు పరిహారం అన్నట్లుగా ఈ ప్రయోజనాన్ని అందించాలని నిర్ణయించారు. అదే క్రమంలో గర్భస్థ సమయంలో ఏదైనా అనారోగ్య సమస్యలను తగ్గించడానికి, వారి సంరక్షణకు, శిశు మరణాలు, పోషకాహార లోపం, పాలిచ్చే తల్లుల్లో ఆరోగ్యకరమైన ప్రవర్తనను ప్రోత్సహించేలా, జనన రేటులో లింగ నిష్పత్తిలో వ్యత్యాసం లేకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది. ఈ పథకం ప్రభుత్వ ఉద్యోగులకు వర్తిస్తుంది. ఇందులో భాగంగానే 19 ఏళ్ల పైబడిన గర్భిణులు, బాలింతలకు మొదటి ప్రసవానికి సంబంధించి రూ.5 వేలు వేసి నగదు ప్రయోజనం అందిస్తున్నారు. గతంలో మూడు విడతల్లో, ప్రస్తుతం రెండు విడతల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జమ అయ్యాయి. అయితే చివరి రుతుస్రావం నుంచి ఆరు నెలల్లోపు గర్భం నమోదైనట్లు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్దేశించిన వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత తొలి విడతగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో రూ.3 వేలు జమ అవుతుంది. అలాగే ప్రసవ అనంతరం బిడ్డకు బీసీజీ, ఓపీవీ, డీపీటీ, హెపటైటిస్-బీ వ్యాక్సిన్లు వేసుకున్న నిర్ధారణ అనంతరం 14 వారాల తర్వాత రూ.2 వేలు జమ చేస్తారు. అదే క్రమంలో రెండో కాన్పులో ఆడబిడ్డ జన్మించినట్లయితే బిడ్డకు అన్ని రకాల వ్యాక్సిన్లు వేసి నిర్ధారించబడితే 14 వారాల తర్వాత ఒకే విడతలో రూ.6వేలు తల్లి బ్యాంకు ఖాతాలో నగదును జమ చేస్తారు.

నెలలోపు సమస్యను పరిష్కరించేలా చర్యలు



ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన ద్వారా 2017 నుంచి సుమారు పది వేలకు పైగా వివిధ సాంకేతికపరమైన కారణాలతో దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రస్తుతం అమలవుతున్న పీఎంఎంవీవై 2.0లో కూడా ఇప్పటి వరకు 897 దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇప్పటికే ఈ సమస్యను రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే పీఎంఎంవీవై పోర్టల్‌ను సవరించి తిరిగి దరఖాస్తు చేసుకునే వెలుసుబాటు కల్పిస్తామని చెప్పారు. పోర్టల్ మార్పు జరిగిన వెంటనే పెండింగ్ దరఖాస్తులను తిరిగి అప్‌లోడ్ చేస్తాం. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏఈపీఎస్ విధానంలో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అవుతుంది.
- నరేష్, పీఎంఎంవీవై ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, ఉమ్మడి కర్నూలు జిల్లా



కొట్టాల చెరువు ప్రాథమిక వైద్య కేంద్రం

పది వేల మందికి అందని నగదు ప్రయోజనం

ఉమ్మడి కర్నూలు పరిధిలోని 44 అర్బన్ హెల్త్ సెంటర్లు, 87 ప్రాథమిక వైద్య కేంద్రాల పరిధిలో ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన కింద ఎనిమిదేళ్ల నుంచి దరఖాస్తు చేసుకున్న సుమారు పది వేల మందికి పైగా లబ్ధిదారులకు నగదు ప్రయోజనం అందనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అదే క్రమంలో పీఎంఎంవీవై 2.0లో కూడా 897 మంది లబ్ధిదారులకు ఈ నగదు ప్రోత్సాహం అందలేదు. ఇందుకు గల కారణాలను అన్వేషిస్తే పీఎంఎంవీవై ద్వారా అందే నగదు ప్రోత్సాహం ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టమ్ (ఏఈపీఎస్) ద్వారా చేరుతోంది. అంటే ఆధార్ నంబర్‌కు లింక్ కాబడిన బ్యాంకు ఖాతాలోనే ఈ నగదు జమ అవుతోంది. అయితే ఆధార్, బ్యాంకు లింకులో చోటు చేసుకున్న తదితర సాంకేతికపరమైన కారణాలతో ఈ సమస్య ఉత్పన్నమైనట్లు అధికారులు చెబుతున్నారు. అనేకమార్లు వాటిని సవరించి పోర్టల్‌లో వివరాలు అప్‌లోడ్ చేసినా సమస్య పరిష్కారం కావడం లేదని అంటున్నారు. ఇప్పటికే ఈ సమస్యను రాష్ట్ర కోఆర్డినేటర్ దృష్టికి తీసుకెళ్లగా ఏడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ తిరిగి అప్‌లోడ్ చేయాలన్న ఆలోచనతో పీఎంఎంవీవై ప్రోగ్రామ్ ఆఫీసర్లు భావిస్తున్నారు. ఈ ప్రక్రియ మరో నెల రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే ఈ సమస్యపై క్షేత్ర స్థాయిలో అంగన్‌వాడీ వర్కర్లకు, ఆశాలు, ఏఎన్ఎంలకు, ప్రైవేటు, అర్బన్ హెల్త్ సెంటర్ల డాక్టర్లకు కూడా సరైన అవగాహన లేకపోవడం గమనార్హం. దీంతో ఈ సమస్య గురించి ఎవరిని సంప్రదించాలో తెలియక ఏళ్ల తరబడి నగదు ప్రోత్సాహం అందని లబ్ధిదారులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికార యంత్రాంగం చొరవ తీసుకుని ప్రధానమంత్రి మాతృత్వ వంద యోజన ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరికీ కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహం అందించేలా చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

భూ చిక్కులు తొలగేనా...?



కర్నూలు అగ్రికల్చర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జగనన్న భూసర్వే-భూరక్ష పేరుతో గత వైసీపీ ప్రభుత్వం భూముల సర్వే చేపట్టి రైతుల జీవితాల్లో అల్లకల్లోలం నింపింది. ఎన్నెన్నో చిక్కులు కొత్తవి పుట్టుకు వచ్చాయి. కూటమి అధికారంలోకి రాగానే తమ భూ సమస్యలు తొలగిపోతాయని రైతులు ఆశలు పెట్టుకున్నారు. గత సంవత్సరం నవంబరు, డిసెంబరు నెలల్లో రెవెన్యూ సదస్సుల పేరుతో కూటమి ప్రభుత్వం గ్రామాల్లో రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టింది. అయితే ఎన్నెన్నో సమస్యలు రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల నుంచి వెల్లువెత్తడంతో పూర్తి స్థాయిలో వాటిని సరిదిద్దే పరిస్థితి కనిపించడం లేదని ఆ విభాగాల అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పూర్తి స్థాయిలో రైతుల భూ వివాదాలకు చెక్ పెట్టాలని కూటమి ప్రభుత్వం భావించింది. సోమవారం నుంచి మండలానికి ఒక గ్రామం చొప్పున భూ సర్వే చేపట్టాలని రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో 26 మండలాల పరిధిలో 25 గ్రామాలను పైలట్ ప్రాజెక్టు కింద (కర్నూలు అర్బన్) తప్ప ఎంపిక చేశారు. అదేవిధంగా నంద్యాల జిల్లాలో 28 మండలాల్లో 28 గ్రామాలను ఎంపిక చేసి సర్వే చేపట్టనున్నారు. ఈ సర్వేను ఏప్రిల్ నెలాఖరుకు ముగించి రైతుల భూ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రెండు శాఖల అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ నెల 10వ తేదీ నుంచే ప్రభుత్వ భూముల్ని రీసర్వే చేసే కార్యక్రమం మొదలైంది. 20వ తేదీ నుంచి రైతులకు సంబంధించిన ప్రైవేటు, వ్యవసాయ భూములను రీసర్వే చేస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

- నేటి నుంచి మండలానికి ఒక గ్రామం పైలట్ ప్రాజెక్టుగా సర్వే
- నాలుగు నెలల్లో రీసర్వే పూర్తే లక్ష్యం
- కలవరపెడుతున్న రోవర్ల కొరత

రైతుల సమక్షంలోనే రీ సర్వే

ఉమ్మడి జిల్లాలో 921 గ్రామాలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 475, నంద్యాల జిల్లాలో 446 గ్రామాల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న భూరక్ష-భూసర్వే పేరుతో భూములను సర్వే చేశారు. అయితే అడ్డదిడ్డంగా ఈ సర్వే కార్యక్రమం కొనసాగడంతో రైతుల మధ్య చిచ్చు రేగింది. రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ఇప్పటికీ తమ భూ సమస్యలను పరిష్కరించాలని కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నారు. అప్పట్లోనే కర్నూలు జిల్లాలో 255 గ్రామాల్లో, అదేవిధంగా నంద్యాల జిల్లాలో 211 గ్రామాల్లో భూసర్వే పూర్తయినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆదేశాలతో రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖల అధికారులు, సిబ్బంది రీసర్వేకు సిద్ధమవుతున్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. రైతుల సమక్షంలోనే వారి ఆమోదంతోనే రీసర్వే చేసేందుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. భూముల విస్తీర్ణం తగ్గిందని, హద్దులు మార్చేశారని, తనకు అందించిన హక్కు పత్రాల్లో తప్పులు దొర్లాయని రైతులు రెవెన్యూ అధికారుల వద్ద మొర పెట్టుకుంటూనే ఉన్నారు.

రోవర్ల కొరత.. సరిపడా ల్యాప్‌ట్యాప్‌లు ఏవీ..?

రీసర్వేకు రోజులు దగ్గర పడుతుండటంతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలోగా రీసర్వేను పూర్తి చేస్తామో లేదోనని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు. కర్నూలు జిల్లాలో 151 రోవర్లు సిద్ధం చేశారు. వాటిల్లో 5 నుంచి 10 రోవర్లు మాత్రమే సక్రమంగా లేవని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా నంద్యాల జిల్లాలో 188 రోవర్లకుగాను 38 రోవర్లు సక్రమంగా పని చేయలేదని, మరమ్మతులు చేయిస్తామని ఆ జిల్లా అధికారులు చెబుతున్నారు. ల్యాప్ ట్యాబ్‌లు కూడా పూర్తి స్థాయిలో పని చేయడం లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గ్రామాల్లో ఏర్పాటు చేసిన సర్వే సిబ్బంది మండల, జిల్లా స్థాయిలోని అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో రీ సర్వే చేపట్టేందుకు ప్రభుత్వం అన్ని పరికరాలను సిద్ధంగా సమకూర్చితే తప్ప లక్ష్యం మేరకు సకాలంలో భూసర్వే పూర్తయ్యే పరిస్థితులు కనిపించడం లేదు.



భూముల రీసర్వేకు వినియోగించే రోవరు

రైతుల భూచిక్కులు తొలగిస్తాం



ప్రభుత్వం ఆదేశించిన మేరకు ఈ నెల 20వ తేదీ నుంచి మండలానికి ఒక గ్రామంలో పూర్తి స్థాయిలో సర్వే చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. రోవర్లతోపాటు ల్యాప్‌ట్యాబ్‌లు సమకూర్చుకుంటున్నాం. సర్వేను రైతుల సమక్షంలోనే చేపడతాం. ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్వే పూర్తి చేస్తాం. - మునికన్నన్, సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డ్స్ డీడీ

ప్రాజెక్టులకు నిధులు రాబట్టాలి



బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల (కల్చరల్), జనవరి 19: వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు రాబ ట్టాలని రాయలసీమ సాగు నీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. ఆదివారం నంద్యాలలో వివేకానంద ఆడిటోరి యంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో 'తుంగభద్ర, కృష్ణా జలాల సంరక్షణ- అభివృద్ధి అంశంపై సమావేశం జరిగింది. సమితి ఉపాధ్యక్షులు వైఎస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడారు. ప్రతి ఏటా కృష్ణా, తుంగభద్ర నదుల నుంచి కొన్ని వందల టీఎంసీల నీళ్ల శ్రీశైలం దాటి దిగువకు పోతున్నాయని ముఖ్యమంత్రి గారే స్వయంగా ప్రకటించారని గుర్తు చేశారు. ఇదే సందర్భంలో కృష్ణా నది ఎండిపోయిందని, నదిలో నీళ్లు లేవని చెబుతూ గోదావరి నుంచి బానకచర్లకు నీటిని మళ్లిస్తామని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. హక్కుగా ఉన్న నీటిని రాయలసీమ ఏనాడు పూర్తిగా వాడుకోలేదన్నారు. అందుకు కారణం దశాబ్దాల కింద మొదలు పెట్టిన ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి కాకపోవడం, ప్రాజెక్టుల కింద ఉన్న ప్రధాన కాలువల అసంపూర్తి, పంట కాలువల మరమ్మతులకు నోచుకోకపోవడమేనని అన్నారు. తుంగభద్ర, కృష్ణా జలాల సద్వినియోగానికి కార్యాచరణ చేపట్టకుండా పోలవరం ఆంధ్ర ప్రదేశ్‌కు జీవనాడి అని, గోదావరి నుంచి బానకచెర్లకు నీళ్ల తెచ్చి ప్రతి ఎకరాకు నీరు అందిస్తామని చెప్పడం రాయలసీమ ప్రజలను మభ్యపెట్టడమేనని స్పష్టం చేశారు. ప్రజల హృదయ స్పందన అయిన సిద్దేశ్వరం అలుగు నిర్మాణం, గుండ్రేవుల రిజర్వాయర్, వేదవతి ఎత్తిపోతల నిర్మాణాలను తక్షణమే చేపట్టాలని ఆయ న డిమాండ్ చేశారు. రాయలసీమలోని వనరుల వినియో గానికి కార్యాచరణ చేపట్టకపోతే ప్రజల్లో అంతర్లీనంగా ఉన్న రాయలసీమ విముక్తి ఉద్యమానికి పాలకులే ఆజ్యం పోసిన వారవుతారని అన్నారు. సమావేశంలో సామాజిక రాయలసీమ పార్టీ నాయకులు డా.నాగన్న, కేడీసీసీ డైరెక్టర్ బెక్కం రామ సుబ్బారెడ్డి, మహమ్మద్ పర్వేజ్, ఏరువ రామచంద్రారెడ్డి, సౌదాగర్ ఖాసీంమియా, మాజీ సర్పంచులు రామగోపాల్‌రెడ్డి, కొమ్మా శ్రీహరి, రవికుమార్, పట్నం రాముడు, గాయకుడు గౌడ్, జనార్దన్ రెడ్డి, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ నాయకులు ఆకుమల్ల రహీం, లాయర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేడు ప్రజా వినతుల స్వీకరణ : కలెక్టర్

నంద్యాల కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్‌గ్రీవియన్స్ రెడ్రెస్సల్ సిస్టం (పిజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. అధికారులందరూ ఉదయం 9:30గంటలకు కార్యాల యాలకు చేరుకోవాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్‌స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైభవం.. గోదాదేవి కల్యాణం



కల్యాణ వేడుకల్లో స్వామి, అమ్మవార్లు

- భక్త జనసంద్రమైన గోదాగోకులం
- సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి
- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని మామిదాలపాడులో కొలువైన గోదా రంగనాథస్వామి దేవస్థానంలో శ్రీదేవి,భూదేవి సమేత రంగనాథస్వామివారి కల్యాణోత్సవం ఆదివారం కన్నులపండువగా సాగింది. ధనుర్మాస వ్రత మహోత్సవం పరిసమాప్తి సందర్భంగా గోకుల క్షేత్రంలో 'శ్రీగోదా రంగనాథ స్వామి కల్యాణోత్సవం', 'నిత్య కల్యాణ సేవ' ప్రారంభోత్సవం వైభవంగా నిర్వహించారు. గోకుల క్షేత్రంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలను తిలకించేందుకు కర్నూలు నగరంతోపాటూ వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు ఆనంద పారవశ్యంతో, వేడుకలను తిలకిస్తుండగా వేద మంత్రాల యుక్తంగా, శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు అష్టాక్షరీ పీఠాధిపతి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ, త్రిదండి అష్టాక్షరీ బృందావన జీయర్ స్వామీజీ, త్రిదండి శఠగోప రామానుజ జీయర్ స్వామీజీ పాల్గొన్నారు. అష్టాక్షరీ పీఠాధిపతి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ పర్యవేక్షణలో, ఆలయ వేద పండితులు రమేష్ భట్టాచార్య, కిరణ్ భట్టాచార్య, సహాయకులు లక్ష్మీనారాయణ, మహేశ్వరాచార్యులు కల్యాణ వేడుకలను విశిష్టతను భక్తులకు తెలియజేస్తూ వీనుల విందుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. టీటీడీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్, పారిశ్రామికవేత్త టీజీ శివరాజ్ పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, ఇతర ప్రతినిధులు ఇటిక్యాల పుల్లయ్య, పాలాది వెంకట సుబ్రహ్మణ్యం, మాకం శ్రీనివాస్, వేముల రవి, చిత్రాల వీరయ్య, వేణుగోపాల్, వేముల పవన్‌కుమార్, లింగం కృష్ణయ్య, భీమిశెట్టి ప్రకాశ్ తదితరులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కల్యాణ వేడుకల అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.



స్వామీజీలతో కలసి మాట్లాడుతున్న టీజీ వెంకటేశ

సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

- టీజీ వెంకటేశ్, రాజ్యసభ మాజీ సభ్యుడు

మన సంస్కృతి, సంప్రదాయాలను, భక్తి భావనలను భావితరాలకు అందించాలని, పిల్లలను ఆధ్యాత్మికత వైపు నడిపించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ పిలుపునిచ్చారు. గోదాగోకులంలో జరిగిన కల్యాణ వేడుకల్లో టీజీ వెంకటేశ్, టీజీ రాజ్యలక్ష్మి దంపతులు హాజరై పూజలు చేశారు. జీయర్ స్వాముల ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు దైవిక మార్గాన్ని బోధించాలని, ఆలయాలకు తీసుకురావడం వల్ల వారిలో ఆధ్యాత్మిక, ధార్మిక భావనలు పెంపొంది, భవిష్యత్తులో విలువలతో జీవిస్తారని అన్నారు. భగవంతునికి భక్తులకు అనుసంధానకర్తలుగా గురువులు నిలుస్తారన్నారు. వారు లేనిదే ఇలాంటి బృహత్కర కార్యక్రమాలు లేవని, వారి ఆశీర్వాదాలు భక్తులపై ఎల్లవేళలా ఉండాలని అన్నారు. గోదా గోకుల క్షేత్రం ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతోందని, నిర్వాహకుల కృషి అభినందనీయమన్నారు.

రాయలసీమలోనే గోకుల క్షేత్రానికి ప్రత్యేక స్థానం

గోదాగోకుల క్షేత్రం రాయలసీమ ప్రాంతంలోనే ఒక ప్రత్యేక స్థానం పొందిందని, గోదాదేవి వెలసిన ఈ క్షేత్రం భవిష్యత్తులో మరింత విశిష్టతను సంపాదించుకుంటుందని అన్నారు. భగవంతుడు మనకోసమే మనవెంట ఉంటూ రామ, కృష్ణ, నరసింహ, వామన ఇలా అనేక అవతారాలు దాల్చి మనవెనుకే తిరుగుతున్నాడని చెప్పారు. ఎలా ఆయన భూమండలంపై కారుణ్యరూపంలో వెలసిల్లాడో అలా లక్ష్మీదేవి అమ్మవారు కూడా ఆయన వెంట ఉంటూ భక్తులకు కరుణిస్తూ ఉంటారని చెప్పారు. టీజీ వెంకటేశ్, ఆయన తనయుడు మంత్రి టీజీ భరత్‌లు గోదాగోకుల క్షేత్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు.

- సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ, అష్టాక్షరీ పీఠాధిపతి

వెనుకబడిన ప్రాంతాలకు అన్యాయం

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్



ప్రసంగిస్తున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్

కర్నూలు కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన ప్రాంతాలకు అన్యాయం చేస్తున్నాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ అన్నారు. సీపీఎం 27వ రాష్ట్ర మహాసభ, కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు తెలకపల్లి నరసింహయ్య 6వ వర్ధంతి సందర్భంగా నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం 'రాష్ట్ర సమగ్రాభివృద్ధి - ప్రత్యామ్నాయ విధానాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముందుగా తెలకపల్లి నరసింహయ్య చిత్ర పటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ అమరావతికి వేల కోట్ల రూపాయలు పెడతామంటున్నారని, అక్కడ కనీస వసతులు కల్పించి మిగిలిన అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరారు. గోదావరి నీళ్ల బానకచర్లకు తీసుకొస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు మతి తప్పి మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం చంద్రబాబు జిల్లాలో ప్రాజెక్టులు పూర్తిచేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయడం లేదని అన్నారు. జగన్ సీఎంగా ఉండి కూడా సీమ అవసరాలు ఎలా తీర్చాలో ఒక్క క్షణం కూడా ఆలోచించలేదని విమర్శించారు. ఉన్న ప్రాజెక్టులకు పంట కాలువలు నిర్మిస్తేనే ఉపయోగం ఉంటుందని సూచించారు.

సంపన్నుల అభివృద్ధే తప్ప సమగ్రాభివృద్ధి కాదు : తెలకపల్లి రవి

ప్రజల సొమ్మును వ్యాపారవేత్తలకు ధారాదత్తం చేయడమంటే సంపన్నుల అభివృద్ధి తప్ప సమగ్రాభివృద్ధి కాదని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, సీనియర్ జర్నలిస్టు తెలకపల్లి రవి అన్నారు. ప్రజలను అభివృద్ధి చేసినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఏపీ అభివృద్ధి లోకేశ్, పవన్ అభివృద్ధిగా మారుతోందని విమర్శించారు. కట్టు కథలతో కూడిన అభివృద్ధి తప్ప నిజమైన అభివృద్ధి జరగడం లేదని, సమగ్రాభివృద్ధిపై దృష్టి ఉన్న వాళ్లు అమరావతి, పోలవరం మాత్రమే అభివృద్ధి చేస్తామని చెప్తారా అని ప్రశ్నించారు. రోడ్ల అభివృద్ధి పేరుతో టోల్ బాదుడు వేస్తే ఎవరు అభివృద్ధి చెందుతారని ఘాటుగా విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ వైద్య కళాశాలలో ఎస్ఎఫ్ఐలో పని చేస్తున్నప్పుడు నరసింహయ్య, గఫూర్, షడ్రక్‌ల విప్లవ కార్యక్రమాల గురించి వివరించారు. విజన్ 2047 ప్రజా వ్యతిరేకంగా ఉందని అన్నారు. వెనుకబడిన ప్రాంతాలు, నీటి ప్రాజెక్టులు, ప్రభుత్వ ఆసుపత్రుల గురించి ఇందులో ప్రస్తావన లేదని చెప్పారు. ఈ సదస్సులో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, సీపీఎం అనంతపురం జిల్లా కార్యదర్శి ఒ.నల్లప్ప, తెలకపల్లి హరి, సీపీఎం జిల్లా నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సాంఘిక నాటకాలతో సామాజిక పరివర్తన

సినీ, నాటక దర్శకుడు ఎస్‌కే మిశ్రో



ఎస్‌కే మిశ్రోను సత్కరిస్తున్న స్పెషల్ డీసీ కొండయ్య, రవీంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ జి. మోహన్‌కుమార్

కర్నూలు కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సామాజిక పరివర్తన కోసమే సాంఘిక నాటకాలు దోహదం చేస్తాయని ప్రముఖ సినీ, నాటక దర్శకుడు ఎస్‌కే మిశ్రో అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో 'వారం వారం సాంఘిక నాటకం' కార్యక్రమంలో భాగంగా విజయవాడ దృశ్యవేదిక సంస్థ వారి 'కనకపుష్యరాగం' సాంఘిక నాటకం ప్రదర్శించారు. ఈ నాటక ప్రదర్శనకు ముందు ఏర్పాటు చేసిన సభాకార్యక్రమంలో ఎస్‌కే మిశ్రో మాట్లాడుతూ సాంఘిక నాటకాలు సమాజంలోని రుగ్మతలను తెలియజేస్తూ, మనుషుల్లో ఒక సంస్కరణను తీసుకొని వస్తాయన్నారు. తాను అనేక తెలుగు చిత్రాల్లో నటించినా, రంగస్థలపై సాంఘిక నాటకాలపై ఆసక్తితో ఈ రంగంలోనూ ప్రదర్శనలు చేస్తున్నానని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ కొండయ్య మాట్లాడుతూ నాటకాలు సామాజిక మార్పునకు ఉపయోగపడతాయన్నారు. టీజీవీ కళాక్షేత్రం నిత్యం నాటకాలు ప్రదర్శిస్తూ ప్రేక్షకుల్లో చైతన్య భావాలను నింపుతోందని నిర్వాహకులను అభినందించారు. మరో అతిథి రవీంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ జి.మోహన్‌కుమార్ మాట్లాడుతూ టీజీవీ కళాక్షేత్రం కళారూపాలకు నిలయమై, నిత్యం ఎందరో కళాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. నాటకాల ద్వారా ప్రజల్లో చైతన్యం కలుగుతుందని, ఆ దిశగా కృషి చేస్తున్న కళాకారులకు అభినందనీయమన్నారు. కథా రచయిత ఇనాయతుల్లా మాట్లాడుతూ నాటక దర్శకుడు మిశ్రో సిరివెన్నెల చిత్రంలో మంచి పాత్రలో ప్రేక్షకుల్ని మెప్పించారని, ఆయన కర్నూలు ప్రేక్షకులకు నాటకం ప్రదర్శించడం స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ సమన్వయ కర్తలు డి.ఈశ్వరయ్య, యాగంటీశ్వరప్ప, సీనియర్ నటుడు క్రిష్టఫర్, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సినీ, నాటక దర్శకుడు మిశ్రోను అతిథులు, కళాకారులు ఘనంగా సత్కరించారు. నాటక ప్రదర్శనకు కళాక్షేత్రం పక్షాన రూ.30వేలు పారితోషికం అందజేశారు.

యువతి అదృశ్యం కలకలం

- మాజీ ఎమ్మెల్యే శిల్పా ఇంటి వద్ద తల్లిదండ్రుల నిరసన
- మాజీ కౌన్సిలర్ అనుచరుడు ఎత్తుకెళ్లాడని ఆరోపణ

నంద్యాల, జనవరి 19, (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యం ఘటన నంద్యాల జిల్లా కేంద్రంలో కలకలం రేపుతోంది. వైసీపీకి చెందిన ఓ మాజీ కౌన్సిలర్ ప్రధాన అనుచరుడే తమ కుమార్తెను ఎత్తుకెళ్లారని యువతి తల్లిదండ్రులు పేర్కొనడం దుమారం రేపుతోంది. మూడు రోజుల కిందట ఘటన జరగగా ఆదివారం వైసీపీ మాజీ ఎమ్మెల్యే శిల్పా ఇంటి వద్ద వారు నిరసనకు దిగడం చర్చనీయాంశంగా మారింది. బాధితులు, పోలీసుల వివరాల మేరకు... నగర శివారులోని నందమూరి నగర్‌లో శివకుమార్, పద్మావతిలు నివాసం ఉంటున్నారు. వీరి కుమార్తె నగర శివారులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతోంది. సంక్రాంతి సెలవులు కావడంతో ఇంటి వద్దనే ఉంటోంది. ఈ క్రమంలోనే ఈ నెల 17వ తేదీన 39వ వార్డుకు చెందిన వైసీపీ మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ ప్రధాన అనుచరుడు జయసాయి ఆ యువతిని ఎత్తుకెళ్లాడు. ఈ మేరకు యువతి తల్లిదండ్రులు అదే రోజు సాయంత్రం మాజీ వైసీపీ కౌన్సిలర్‌తోపాటు జయసాయి, అతని తల్లి ఈశ్వరిలపై నంద్యాల తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు మాత్రం ఈ నెల 18వ తేదీన అదృశ్యం కేసుగా నమోదు చేశారు. ఈ క్రమంలోనే యువతి తల్లిదండ్రులు ఆదివారం పట్టణంలోని మాజీ వైసీపీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఇంటి ఎదుట నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని సర్ది చెప్పారు. ఇదిలాఉంటే ఇదే జయసాయి గతంలో సదరు యువతి 10వ తరగతి చదివే సమయంలో బలవంతంగా ఇంటి నుంచి ఎత్తుకెళ్లాడని తెలుస్తోంది. దీంతో అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని సమాచారం.



వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఇంటి ముందు ఆందోళన చేస్తున్న యువతి తల్లిదండ్రులు

లారీ, బైకు ఢీ.. ఒకరి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

తుగ్గలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తుగ్గలి విశ్వం దాబా సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాలివీ.. అనంతపురం జిల్లా పెరుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన కృష్ణ(35), అనంతపురానికి చెందిన గోవింద్ పగిడిరాయి గ్రామంలో పెయింట్ వర్క్ చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఆదోనిలో పెయింటింగ్ తీసుకుని పగిడిరాయి వెళ్తుండగా లారీ, బైకు ఢీకొన్నాయి. కృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా.. గోవిందుకు తీవ్ర గాయాలయ్యాయి. కృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ వైద్యశాలకు తరలించారు. గోవింద్‌ను వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు. కృష్ణకు భార్య తిమ్మక్క, కొడుకు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ముగ్గురిపై జీరో ఎఫ్ఐఆర్

ఆదోని రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలం బురుజులకు చెందిన రామకృష్ణారెడ్డి, రంగమ్మ, రఘునాథ్‌పై ఇస్వీ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ చేశారు. ఎస్ఐ నాగేంద్ర తెలిపిన వివరాలివీ.. బురుజులకు చెందిన రామకృష్ణారెడ్డి పప్పు శనగల వ్యాపారం చేసేవారు. 2021లో అదే గ్రామానికి చెందిన కురువ రాముడు వద్ద రూ.12 లక్షలు విలువ చేసే శనగలను విక్రయించి డబ్బు చెల్లించకపోవడంతో పాటు గ్రామం వదిలి భార్య రంగమ్మ పుట్టినిల్లు పెద్దహరివాణం గ్రామానికి మకాం మార్చారు. రాముడు డబ్బులు చెల్లించాలని అడగడంతో ఆయనపై ముగ్గురు తిరగబడ్డారు. దీంతో రాముడు ఫిర్యాదు మేరకు ముగ్గురుపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసును పత్తికొండకు ట్రాన్స్‌ఫర్ చేశామని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కౌతాళం మండలం కుంటనహాళ్‌కు చెందిన లింగప్ప(19) కర్నూలులో చికిత్స పొందుతూ మృతి చెందారు. పెద్దతుంబళం ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపిన వివరాలివీ.. ఈనెల 16వ తేదీన పొలానికి వెళ్తున్న లింగప్ప హనవాళ్ వద్ద బైకు అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే కోలుకోలేక ఆదివారం మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

- 21 ఏళ్ల తర్వాత అ'పూర్వ' కలయిక
- పర్ల జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కర్నూలు కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దాదాపు రెండు దశాబ్దాల తర్వాత వారందరూ ఒకచోట కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరింపులు.. గత స్మృతులను తలుచుకుంటూ నవ్వులు, ఆనందంగా గడిపారు. కలిసి చదివిన పాఠశాలలో 21 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల కలుసుకున్న అపూర్వ ఘట్టానికి కల్లూరు మండలంలోని పర్ల హైస్కూల్ వేదికగా నిలిచింది. 21 సంవత్సరాల తర్వాత కలుసుకున్న 2003-2004 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల అలనాటి జ్ఞాపకాలివి. ఆదివారం పర్ల జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, జీవన మార్గాన్ని చూపిన పాఠశాలను చూసుకునేందుకు ఈ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ప్రస్తుత పర్ల జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు ద్వారకానాథ శాస్త్రి, సంపత్‌కుమార్, మీనాక్షినాయుడు, నగేష్, కల్పన, గౌరీ పద్మజ, జ్యోతి, గోదాదేవి, ఈ.పాండురంగయ్య, శ్రీధర్‌బాబులు హాజరయ్యారు. వారిని పూర్వ విద్యార్థులు పుష్పమాలలు, శాలువలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులైన ఉప్పర అశోక్‌కుమార్, బి.అయ్యస్వామి, కేపీ మధుశేఖర్, ఉపేంద్ర, శివ, సుధాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, షేక్షావలి, రంగారెడ్డి, యు.సురేష్, టి.లక్ష్మన్నలతోపాటూ సుమారు 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం దాకా ఉత్సాహంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఉపాధ్యాయులతో కల్లూరు మండలం, పర్ల గ్రామ జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

చాలా ఆనందంగా ఉంది



పర్ల పాఠశాలలో నేను 1997-2003 మధ్య తెలుగు పండిట్‌గా పనిచేశాను. అప్పట్లో విద్యార్థుల చదువుపై దృష్టి పెట్టి, ప్రతి విద్యార్థి బాగా చదువుకోవాలని, ఉన్నత స్థితికి చేరుకోవాలనే లక్ష్యంగా బోధించేవాళ్లం. చాలా మంది విద్యార్థులు ఎంతో ఆసక్తిగా చదువుకొనేవాళ్లు. అలాగే వృద్ధిలోకి వచ్చి మమ్మల్ని గుర్తించి సత్కరించడం చూస్తే గురువులకు ఇంతకన్నా సంతృప్తి మరెందులోనూ ఉండదు అనిపిస్తుంది. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయి. పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు మంచి లక్ష్యంతో ముందుకెళ్లాలి.

- ఈ.పాండురంగయ్య, విశ్రాంత హెచ్ఎం, కర్నూలు

క్రమశిక్షణే ఈస్థాయికి చేర్చింది



మాది కె.నాగలాపురం వద్దగల బూడిదపాడు. 2003-2004లో పది ఔటింగ్ బ్యాచ్. చాలా మంది విద్యార్థులు ఈ స్కూల్‌లో చదువుకుని ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నారు. అంతా వృద్ధిలోకి వచ్చిన వాళ్లమే. నైతిక విలువలు, సమాజం పట్ల గౌరవభావాలు, బాధ్యతలు మా గురువులు నేర్పించారు. అందుకే ఈ స్థాయికి చేరుకోగలిగాం. విద్యార్థులకు బాగా చదువు రావాలన్న భావనతో వారు కొట్టినా, దండించినా అది మా భవిష్యత్తుకు ఉపయోగపడేలా నిలిచింది.

- బి.అయ్యస్వామి, పూర్వ విద్యార్థి

అడవిని తలపిస్తున్న చెరువు

● కంపచెట్లతో నిండిన మల్లెలమ్మ చెరువు ● ఆందోళనలో రైతులు

కొత్తపల్లి జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపురం, గోకవరం, కొత్తపల్లి రైతుల పంటలకు సాగునీరు అందించడానికి 50ఏళ్ల క్రితం లింగాపురం గ్రామ శివారులో మల్లెలమ్మ చెరువును ఏర్పాటు చేశారు. సుమారు 60 ఎకరాల్లో రైతుల నుంచి భూసేకరణ చేసి ఈ చెరువును ఏర్పాటు చేశారు. ఈ చెరువుకు ఆత్మకూరు మండలంలోని శివభాష్యం ప్రాజెక్టు నుంచి నీరు అందించేవారు. అయితే గత కొన్నేళ్లుగా ఈ చెరువును ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో అడవిని తలపిస్తోంది. దీంతో పాటు చెరువులో పూడిక పేరుకుపోయి అరణ్యాన్ని తలపిస్తూ రైతులకు సాగునీరు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 180 ఎకరాలకు నీరు అందించాల్సి ఉండగా.. సగం ఎకరాలకు మాత్రమే నీరు అందుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చెరువులపై ప్రత్యేక దృష్టి సారించి పూడికతో నిండిపోయి అరణ్యంగా తలపిస్తున్న చెరువులకు మహర్దశ కల్పించి రైతులకు సాగునీరు అందించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉంటే కొందరు చెరువును కూడా ఆక్రమించుకుని పంటలు సాగు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.


మల్లెలమ్మ చెరువులో పెరిగిన కంపచెట్లు

పూడికతీత పనులు చేపట్టాలి

గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోకపోవడంతో మల్లెలమ్మ చెరువు పూడికతో నిండిపోయి అడవిని తలపిస్తోంది. దీంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే పూడికతీత పనులు చేపట్టి ముళ్లపొదలను తొలగించి రైతులకు సాగునీరు అందించాలి.

- రైతు చిన్న పుల్లారెడ్డి, లింగాపురం, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు

రేపటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

జూపాడుబంగ్లా, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూపాడుబంగ్లా, తరిగోపుల గ్రామాల్లో ఈనెల 21 నుంచి 24 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. ఈనెల 21, 22 తేదీల్లో జూపాడుబంగ్లాలోని జంగాలపేటలోని అంగన్వాడీ కేంద్రం-2 వద్ద ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 23, 24న తరిగోపుల గ్రామంలోని బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం-3 వద్ద క్యాంపు జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని గ్రామప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

కొత్తూరులో పూజలు

పాణ్యం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బరాయుని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ పూజలు నిర్వహించారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం శేష వస్త్రాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. వీఆర్వో జయరాముడు, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు సురేష్‌శర్మ ఉన్నారు.

సరస్వతి అమ్మవారికి..

కొత్తపల్లి జనవరి 19(ఆంధ్రజ్యోతి): కొలనుభారతి క్షేత్రంలో ఆదివారం పుష్యమాసం బహుళ పంచమి తిథిని పురస్కరించుకుని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాతఃకాల సమయంలోనే అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కైంకర్యాలను సంప్రదాయబద్ధంగా చేపట్టారు. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

'నరసింహయ్య పోరాటం స్ఫూర్తిదాయకం'

ఆత్మకూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా మార్క్సిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత తెలకపల్లి నరసింహయ్య పోరాటం స్ఫూర్తిదాయకమని సీపీఎం నాయకులు రణధీర్, సుధాకర్ అన్నారు. ఆదివారం తెలకపల్లి నరసింహయ్య 6వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నిత్యం కరువుకాటకాలతో అవస్థలు పడే కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్ట్ సాధన కోసం నరసింహయ్య అనేక పోరాటాలు సాగించారని అన్నారు. బాల్యం నుంచి తుదిశ్వాస వదిలే వరకు దళితులు, గిరిజనులు, వెనకబడి తరగతులు, మైనార్టీల సంక్షేమం కోసం పాటుపడ్డారన్నారు. కర్నూలు, అనంతపురం, మహబూబ్‌నగర్ జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి ఆయన కృషి మరువలేనిదని కొనియాడారు. నాయకులు వీరన్న, భాస్కర్, కిరణ్, రమణ, నబి, రవి, రైట్‌బాషా తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కురువ సంఘం నాయకులు

నంద్యాల (కల్చరల్), జనవరి 19(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని కురువ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కురువ సంఘం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కైప విజయకిరణ్, కల్దే విజయకుమార్, కమిటీ సభ్యులతో సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ ఏడాది కూడా కురువ సామాజిక విద్యార్థులు పది(500), ఇంటర్(900) మార్కులపైన సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, నూతన సంవత్సరంలో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించుకున్నారు. కార్యక్రమంలో శ్రీరాములు, కైప హరినాథ్‌బాబు, సోమశేఖర్, మద్దిలేటి, వెంకటసుబ్బయ్య, నారాయణ, సుధాకర్, మల్లేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి భూ రీ సర్వే

పాములపాడు జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబాలపల్లి గ్రామంలో భూ రీ సర్వే సోమవారం నుంచి చేపడుతున్నామని, సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో భూములు కలిగిన రైతులు సంబంధిత ఆధార పత్రాలతో వచ్చి రీ సర్వే అధికారులకు సహకరించాలని కోరారు.

పగిడ్యాల(ఆంధ్రజ్యోతి): పగిడ్యాల గ్రామంలో సోమవారం నుంచి భూములను రీ సర్వే చేపడుతున్నట్లు తహసీల్దార్ శివరాముడు తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పగిడ్యాల గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేసి భూములను రీసర్వే చేయనున్నట్లు తెలిపారు. గ్రామంలోని పొలాలను 25 బ్లాకులుగా విభజించినట్లు, ఒక్కో బ్లాకులో 200 నుంచి 250 ఎకరాలుగా విబజించినట్లు తెలిపారు. బ్లాకుల వారిగా సర్వే చేసే భూములను ముందుగానే రైతులకు తెలియజేసి సర్వే చేయనున్నట్లు తెలిపారు.

వసంత పంచమి ఏర్పాట్లపై రేపు సమీక్ష

కొత్తపల్లి జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనుభారతి పుణ్యక్షేత్రంలో మంగళవారం ఉదయం 10 గంటలకు సరస్వతి అమ్మవారి వసంత పంచమి ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామలింగారెడ్డి, ఛైర్మన్ వెంకట నాయుడు తెలిపారు. ఫిబ్రవరి 2న జరిగే వసంత పంచమి ఏర్పాట్లపై నిర్వహించే సమావేశానికి నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, నంద్యాల దేవాదాయ శాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ మోహన్‌లు హాజరవుతున్నట్లు తెలిపారు. అలాగే వీరితో పాటు మండలంలోని ఆయా శాఖలకు చెందిన అధికారులు కూడా హాజరు కానున్నట్లు తెలిపారు.

రేపు వేలం పాటలు

కొలనుభారతి పుణ్యక్షేత్రంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు వివిధ రకాల దుకాణాల ఏర్పాట్లపై బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామలింగారెడ్డి తెలిపారు. ఏడాది పాటు ఆలయ ప్రాంగణంలో దుకాణాలు నిర్వహించేందుకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా గాజులు, బొమ్మల దుకాణాలు, హోటళ్లు, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్, బెల్లం చెరుకులు, పుచ్చకాయల పండ్లతో పాటు అమ్మవారి ఫొటోలు విక్రయించుకునేందుకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలాల్లో పాల్గొనేవారు ప్రతి దుకాణానికి ముందుగానే రూ.2వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. వేలం పాట ముగిసిన వెంటనే పాట దారుడు పూర్తి పైకం చెల్లించాలని తెలిపారు. ఏ కారణం చేతనైనా సరైన పాట రాకపోతే వేలం పాటలను వాయిదా వేసే హక్కు దేవస్థానానికి ఉంటుందన్నారు. హిందూ మతస్థులు తప్ప అన్య మతస్థులు వేలంలో పాల్గొనకూడదన్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి: సీపీఎం



ఆత్మకూరు, కొత్తపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచిన కేంద్ర మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని సీపీఎం నాయకులు రణధీర్, సుధాకర్, స్వాములు డిమాండ్ చేశారు. ఆదివారం ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గో బ్యాక్ అమిత్‌షా అంటూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో రాజ్యాంగానికి సంబంధించిన చర్చ జరిగే సమయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు. ఈ విషయంపై ప్రధాని మోదీ స్పందించకపోవడం సరికాదన్నారు. తక్షణమే కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేసి ఆయన పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సంపత్‌కుమార్, సురేంద్ర, రామ్‌నాయక్, శివకుమార్, కిరణ్, మల్లయ్య, గణపతి, రమణ, రవి తదితరులు ఉన్నారు.

కొత్తపల్లి(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాను పార్లమెంటు బర్తరఫ్ చేయాలని సీపీఎం కొత్తపల్లి మండల కార్యదర్శి ఎస్.స్వాములు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకులు పాతకోట భాస్కర్, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు బొల్లు ప్రసాద్‌బాబు యాదవ్, దళిత నాయకులు గూడెం బాలనాగన్న డిమాండ్ చేశారు. అమిత్‌షా విజయవాడ రాకను నిరసిస్తూ ఆదివారం కొత్తపల్లి మండలంలో గాంధీ విగ్రహం ముందు అమిత్‌షా గో బ్యాక్ అంటూ నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ అంబేడ్కర్ పేరును చెప్పడానికి కూడా సహించలేని స్థితిలో బీజేపీ ప్రభుత్వం ఉందని ఘాటుగా విమర్శించారు. పాతకోట వెంకటరమణ, అంకన్న, ప్రభుదాస్, మోక్షేశ్వరుడు, శ్రీను పాల్గొన్నారు.

గుర్తు తెలియని సాధువు మృతి

ఆత్మకూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి) పట్టణంలో ఆది వారం గుర్తు తెలియని 70ఏళ్ల ఓ సాధువు మృతిచెందారు. ఆయన కొంత కాలంగా ఆత్మకూరు ప్రాంతంలోనే భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలోనే చక్రం హెటల్ సమీపంలోని అస్వస్థతకు గురై కిందపడిపోయారు. ఆయన్ని గుర్తించిన స్థానికులు సపర్యలు చేసే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతిచెందారు. అక్కడున్న వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ నారాయణరెడ్డి, ఏఎస్ఐ శంకరరెడ్డి అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సాధువు ఆచూకీ కోసం ప్రయత్నించగా ఎలాంటి ఫలితం లేకపోయింది. దీంతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చి మృతదేహానికి స్థానిక యువకుల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు.

సిద్ధాపురంలో కార్డన్ సెర్చ్

ఆత్మకూరు రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధాపురం గ్రామంలో ఆత్మకూరు అర్బన్ సీఐ రాము, ఎస్ఐ వెంకట నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పలు ఇళ్లలో ఆకస్మిక సోదాలు చేపట్టారు. గ్రామంలోని పలు గృహాల్లో నిర్వహించిన సోదాల్లో ఎలాంటి పత్రాలు లేని 11 మోటర్ బైక్‌లను సీజ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాము వెల్లడించారు.

సారా స్థావరం ధ్వంసం

సిద్ధాపురం శివారులో సారా స్థావరాలపై పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్‌లో భాగంగా ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు సీఐ రాము ఆదివారం తెలిపారు. గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో సోదాలు నిర్వహించామని తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా ఆ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఓ నాటుసారా స్థావరాన్ని గుర్తించి బట్టి వద్ద ఉన్న 3000 లీటర్ల బెల్లపు ఊటను, తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు.అలాగే అక్కడి 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీసుల రాకను గమనించిన సారా నిర్వాహకుడు ఏసుబాబు పరారయినట్లు తెలిపారు.

'12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలి'


మాట్లాడుతున్న సాంబశివుడు

నంద్యాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగులకు 12వ వేతన సవరణ సంఘాన్ని తక్షణమే నియమించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యుడు సాంబశివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు కోరారు. నంద్యాలలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆదివారం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 7వ వేతన సవరణ సంఘం గడువు 2025 డిసెంబరు వరకు ఉన్నప్పటికీ సంవత్సరం ముందే 8వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుందని అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం కూడా 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా నాయకులు పుల్లయ్య, రవి, పవన్‌కుమార్, మునిస్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వేమన జయంతి



నివాళి అర్పిస్తున్న కవులు, ఉపాధ్యాయులు

నంద్యాల (కల్చరల్), జనవరి 19(ఆంధ్రజ్యోతి: నంద్యాల పింగళిసూరన శాఖ గ్రంథాలయంలో ఆదివారం యోగి వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. కవులు, ఉపాధ్యాయులు, సాహితీ స్రవంతి సభ్యులు వేమన చిత్రపటానికిపూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి అధ్యక్షుడు శ్రీనివాస మూర్తి, ఉపాధ్యాయులు, కవులు శ్రీనివాసమూర్తి, అన్నెం శ్రీనివాస రెడ్డి, డా.నీలం వెంకటేశ్వర్లు, మాబుబాషా, మధుసూదన్, ప్రసాద్, రికార్డు అసిస్టెంట్ శ్రీధర్, సాహితీ స్రవంతి సభ్యులు పాల్గొన్నారు.

దంపతులపై దుండగుల దాడి

● నగలు, నగదు ఎత్తుకెళ్లారని ఫిర్యాదు

పాణ్యం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీఎం అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా దంపతులపై ఇద్దరు దుండగులు దాడి చేశారు. పాణ్యం మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. మహిళ బహిర్భూమికి ఆసుపత్రి సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న పొలంలోకి వెళ్లిన సమయంలో ఇద్దరు దుండగులు దంపతులపై దాడి చేసి గాయపరిచారు. తమ ఇద్దరినీ తాడుతో కట్టివేసి బంగారు గొలుసు, తాళి, నగదును దోచుకెళ్లారని దంపతులు ఫిర్యాదు చేశారు. తీవ్రంగా గాయపడిన దంపతులను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నట్లు తెలిపారు. పాణ్యం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులను విచారిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గడివేములలో గురువులతో పూర్వ విద్యార్థులు


గాజులపల్లిలో..

గడివేముల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో 1983-88 సంవత్సరం వరకు చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా తరలివచ్చి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించు కున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను బస్టాండు ఆవరణం నుంచి హైస్కూల్ పాఠశాల వరకు మంగళవాయిద్యాలతో ఊరేగించారు. ఉపాధ్యా యులను ఘనంగా సన్మానం చేశారు. స్నేహితులు అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాలకు రూ.30 వేలు విలువ చేసే జ్యోతి ప్రజ్వలన దీపాన్ని అందజేశారు. ఉపాధ్యాయులు సీతమ్మ, శివరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వాసుదేవ గుప్తా, సూర్యప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

మహానంది(ఆంధ్రజ్యోతి): గాజులపల్లి గ్రామంలో ఆదివారం 2008-2009 సంవత్సరంలో జడ్పీ పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించు కున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని మధురానుభూతి చెందారు. అప్పట్లో తాము చేసిన చిలిపి మజిలీలను తలుచుకొని ఆనందంగా గడిపారు. గురువులను సన్మానించి మెమెంటోలు అందజేశారు.

23న రక్తదాన శిబిరం

నంద్యాల కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): 76వ గణ తంత్ర దినోత్సవాన్ని పురష్కరించుకొని ఈనెల 23వ తేదీన నంద్యాల మున్సిపల్ పార్కులోని ఆయుష్ యోగా సెంటర్ నందు రెడ్‌క్రాస్ సొసైటీ, ఆయుష్ యోగా సేవ సమితి సభ్యుల సంయుక్త సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా ఛైర్మన్ దస్తగిరి పర్ల, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కోఆర్డినేటర్ కండే ఆనంద్‌గురూజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆనంద్‌గురూజీ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రక్తదానం చేస్తున్నవారికి జీవీ మాల్ వారి 10శాతం డిస్కౌంట్ కూపన్, పల్లాస్ హోటల్ వారిచే భోజన కూపన్స్, ఫ్రెండ్స్ ఫర్ సేవా వారి టీ షర్టు, మెమెంటో, రెడ్‌క్రాస్ సొసైటీ వారి సర్టిఫికెట్ ఇస్తూ రక్తదాతను అనేక సంస్థల ప్రతినిధులచే సముచితంగా గౌరవిస్తారన్నారు. 18 నుంచి 60 సంవత్సరాలలోపు వారు రక్తదానం చేయొచ్చని చెప్పారు. ఈ రక్తదాన శిబిరం ద్వారా సేకరించిన రక్తాన్ని రెడ్ క్రాస్‌సంస్థ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రి రక్తనిధి కేంద్రాలలోని తలసేమియా వ్యాధిగ్రస్తులైన చిన్నారులకు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9989983673,8977750583 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతులు ప్రదానం చేస్తున్న ముఖ్య అతిథులు, నిర్వాహకులు

నంద్యాల కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో నగరడోణ సుధీర్ అధ్యక్షతన జిల్లాలోని బ్రాహ్మణ మహిళలకు సంక్రాంతి సందర్భంగా ఆన్‌లైన్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు ఆదివారం నంద్యాల సత్యసాయి కళ్యాణ మండపంలో బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెంకట రామరాజు, కామేశ్వరప్రసాద్, నాగరాజరావు, గాజులపల్లె రవి తదితరులు పాల్గొని బహుమతులు ప్రదానం చేశారు. 1,2,3,4,5,6,7,8,9 బహుమతులు వరుసగా డోన్ లక్ష్మీప్రసన్న, నంద్యాల ఎస్.మల్లిక, డోన్ ఎన్.సుకన్య, నంద్యాల రమ్య, ఆళ్లగడ్డ కృష్ణవేణి, నన్నూరు కీర్తి, ఆత్మకూరు చంద్రిక, నంద్యాల వాసంతి, నంద్యాల స్వాతికి బహుమతులు ప్రదానం చేశారు. అలాగే పాల్గొన ప్రతి మహిళకు పోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాజశేఖర్, పరమేష్, బాలగంగాధర శాస్త్రి, పవన్, కృష్ణమోహన్, వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

నంద్యాల క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లాలో నేర నియంత్రణ,శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ అధికారులు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయా స్టేషన్ల పరిధిలో నివసిస్తున్న రౌడీషీటర్లు, నేరచరిత్రగలవారికి, చెడునడత కలిగిన వ్యక్తులకు సత్ప్రవర్తనతో జీవించాల, నేరప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రస్తుతం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరాతీశారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యాకలాపాల్లో పాల్గొనవద్దని సూచించారు. నిరంతరం నిఘా ఉంటుందని, పోలీసుల మాటలను వినకుండా చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

నంద్యాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఖజానా, లెక్కల సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నంద్యాల జిల్లా కేంద్రంలోని ఖజానా శాఖ కార్యాలయంలో నిర్వహించారు. కడప జిల్లా శాఖకుచెందిన ప్రభుదాస్ ఎన్నికల అధికారిగా, కేవీ అనిల్ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారు. కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా అధ్యక్షుడిగా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శిగా శ్రీనివాసరాజు, అసోసియేట్ అధ్యక్షుడిగా తేజబాబు, జాయింట్ సెక్రటరీలుగా ప్రవీణ్‌కుమార్, సుభాషిణి, మురళీకృష్ణుడు, జిల్లా ఉపాధ్యక్షులుగా సుమలత, భాస్కర్‌రెడ్డి, దినేష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజేశ్వరరావు తదితరులు ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులను ఖజానాశాఖ సిబ్బంది అభినందించారు.

ఘనంగా 'సంఘమిత్ర' వార్షికోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు

నంద్యాల కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రథమ నంది దేవస్థానంలోని వైఎస్సార్ కళ్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం సంఘమిత్ర 31వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, వెలుకూరి సురేష్‌కుమార్, గంగదాసరి నరసింహారెడ్డి, ట్రాఫిక్ సీఐ బాదామి మల్లికార్జున గుప్తా హాజరై జ్యోతి ప్రజల్వన, భారత్‌మాతకు మాలార్పణ, ధ్వజరోహణ, ఛాయా చిత్ర ప్రదర్శన తదితర కార్యక్రమాలను ప్రారంభించారు. సంఘమిత్ర విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిచారు. సంఘమిత్ర అధ్యక్షుడు కర్నాటి నాగసుబ్బారెడ్డి, కార్యదర్శి చిలుకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘమిత్ర నిర్వహించే అనేక సేవాకార్యక్రమాల గురించి వివరించారు. అతిథులు ఆర్ఎస్ఎస్ ప్రాంత సేవ ప్రముఖ్ కామునూరి మనోహర్, ముఖ్యవక్త బాలిశెట్టి సుబ్బలక్ష్మయ్య మాట్లాడుతూ సంఘమిత్ర సేవా సమితి అనేక సేవా నిర్వహించడం అభినందనీయమన్నారు. బీజేపీ నాయకుడు అభిరుచి మధు, సంఘమిత్ర కార్యవర్గ సభ్యులు మహేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, విజయశ్రీ, వెంకటేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

'బీమా ప్రీమియంపై జీఎస్టీ తొలగించాలి'

ఆత్మకూరురూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బీమా పాలసీదారులు చెల్లించే ప్రీమి యంపై కేంద్రం విధిస్తున్న జీఎస్టీని తొలగించాలని ఆత్మకూరు ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, మనోజ్, జాయింట్ సెక్రటరీ నాగన్న ఆదివారం ఓ ప్రకటనను విడుదల చేశారు. జనవరి 19న ఎల్ఐసీ జాతీయకరణ జరిగి 69 ఏళ్లు పూర్తయిందని గుర్తు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎల్ఐసీని బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత కేంద్రంలోని ప్రభుత్వంపై ఉందన్నారు. కాగా గతంలో ఎన్నడు లేని విదంగా పాలసీదారులపై ప్రభుత్వం జీఎస్టీ పేరిట అధిక భారాన్ని మోపిందన్నారు. ఎంప్లాయిస్‌కు చెల్లించే పెన్షన్‌ను 30 శాతం పెంచాలన్నారు.

మినీ గోకులాల పనులు వేగవంతం చేయాలి



పనుల వివరాలు తెలుసుకుంటున్న ఏపీడీ సాంబశివరావు

చాగలమర్రి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఉపాధిహామీ పథకం ద్వార చేపడుతున్న మినీ గోకులాల పనులను వేగవంతం చేయాలని ఏపీడీ సాంబశివరావు సూచించారు. ఆదివారం చాగలమర్రి గ్రామంలోని మల్లేవేముల బస్టాండు సమీపంలో రైతులు నిర్మించుకుంటున్న మినీ గోకులాలను పరిశీలించారు. ఉపాధిహామీ నిధులతో మినీ గోకులాల పనులను పూర్తి చేసుకోవాలని అన్నారు. మండలంలో 25 మినీ గోకులాలకు గాను చక్రవర్తులపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో మినీ గోకులాలను ప్రారంభించడం జరిగిందని అన్నారు. మిగిలిన మినీ గోకులాలు వివిధ దశల్లో ఉన్నాయని, రైతులు త్వరగా పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. మార్చి చివరి నాటికి ఉపాధి కూలీల పనిదినాలు పూర్తి చేయాలని అన్నారు. 60 శాతం మాత్రమే కూలీలకు పనిదినాలు కల్పించామని తెలిపారు. పనులు నిర్వహించుటలో టీఏలు, ఎఫ్ఏలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఉపాధి సిబ్బంది ఉన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



డోన్‌లో సీనియర్ న్యాయవాది నాగభూషణం నాయుడును సన్మానిస్తున్న వాల్మీకి న్యాయవాదులు

డోన్ రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డోన్ వాల్మీకి సంఘం నేత, వాల్మీకి న్యాయవాది సీలం భాస్కర్ నాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహ సమావేశ భవనంలో ఆదివారం ఉమ్మడి జిల్లాలోని వాల్మీకి న్యాయవాదుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వాల్మీకి న్యాయవాది సీలం భాస్కర్ నాయుడు మాట్లాడుతూ వాల్మీకులు ఐకమత్యంగా తమ హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని అన్నారు. అనంతరం కర్నూలు నుంచి వచ్చిన సీనియర్ న్యాయవాది నాగభూషణం నాయుడును పూలమాలలు, శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో కర్నూలు పెద్దాసుపత్రి మెడికల్ ప్రొఫెసర్ మాధవ కృష్ణ, వాల్మీకి న్యాయవాదులు తలారీ కృష్ణ మూర్తి, శివ రామకృష్ణ, శ్రీరాములు, రాజేష్, మోహన్‌తో పాటు నంద్యాల, నందికొట్కూరు, పత్తికొండ, ఆలూరు న్యాయవాదులు పాల్గొన్నారు.

యాగంటి క్షేత్రంలో శివదీక్ష మాలధారణ



శివదీక్ష స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బనగానపల్లె, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): యాగంటి క్షేత్రంలో ప్రతి ఏటా నిర్వహించే శివ దీక్షా మాలధారణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఉదయాన్నే యాగంటి ఉమామహేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి శివదీక్ష చేపట్టారు. అలాగే పలువురు శివదీక్షా చేపట్టారు. కాటసాని దంపతులకు ఈవో చంద్రుడు, పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో యాగంటి ఉమామహేశ్వర స్వామి నిత్యాన్నదాన సంస్థ ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, కోశాధికారి రామారెడ్డి, పాతపాడు చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ పూజారులు పాల్గొన్నారు.

యాగంటి క్షేత్రంలో కమలాపురం ఎమ్మెల్యే



యాగంటి క్షేత్రాన్ని దర్శించుకుంటున్న టీడీపీ ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి దంపతులు

బనగానపల్లె, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి క్షేత్రాన్ని కడప జిల్లా కమలాపురం టీడీపీ ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో చంద్రుడు, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే దంపతులకు ఆలయ ఈవో, పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా కోట్రికే



ఎన్నికైన కోట్రికే హరికిషణ్, విద్యాసాగర్

డోన్ రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా కోట్రికే హరి కిషన్, యువ జన సంఘం అధ్యక్షుడిగా కామిశెట్టి విద్యాసాగర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆర్యవైశ్య సంఘం ఎలక్షన్ కమి షన్ చైర్మన్ కోట్రికే ఫణిరాజ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీ పదవీ కాలం మూడు సంవత్సరాలు ఉంటుందన్నారు. నూతన బాడీ ఎన్నిక అనంతరం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందన్నారు. నూతనంగా ఎన్నికైన వారిని పూలమాలలు వేసి సత్కరించారు.

జ్వాలా, ప్రహ్లాద వరదస్వామికి విశేష పూజలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 19(ఆంధ్రజ్యోతి) : అహోబిలం పార్వేట పల్లకి ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు గ్రామానికి ఆదివారం చేరుకుంది. మేళతాళాలు, డప్పువాయిద్యాలతో పల్లకిని తెలుపుపై కొలువుదీర్చారు. పార్వేట పల్లకిలో కొలువైన జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాద వరదస్వామి ఉత్సవమూర్తులకు ప్రజలు పూజలు చేశారు.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు

కొలిమిగుండ్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్విమానుపల్లె సమీపంలో వెలసిన పెద్దమ్మతల్లి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెలుం గ్రామంలో సత్యమ్మ తల్లి అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకు లు మహేష్‌శర్మ వెల్లడించారు.


నల్లమలను సందర్శించిన స్క్వాడ్ బృందం

రుద్రవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం రేంజ్‌లోని నల్లమలను ఆదివారం స్క్వాడ్ బృందం సందర్శించింది. స్క్వాడ్ రేంజర్ డేవిడ్ వృక్షాలను పరిశీలించారు. ఫారెస్టు అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

బెలుం గుహల్లో సండే సందడి



గుహల్లోకి ప్రవేశిస్తున్న పర్యాటకులు



గుహల అందాలను తిలకిస్తున్న విద్యార్థులు

కొలిమిగుండ్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పర్యాటక కేంద్రం బెలుం గుహల్లో సండే సందడి నెలకొంది. సంక్రాంతి సెలవులు ముగింపు రోజు కావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో బెలుం గుహలకు తరలివచ్చారు. ముఖ్యంగా విద్యార్థులు తరలివచ్చి అందాలను తిలకించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు ఉన్నారు. దీంతో బెలుం గుహలు సందర్శకులతో కళకళలాడాయి. గుహల్లోని ముఖ్య ప్రదేశాలైన పాతాళగంగ, వెయ్యి పడగలు, ఊడలమర్రి, సన్యాసి మఠం, కోటి లింగాలు తదితర ప్రాంతాలను సందర్శించి అబ్బురపడ్డారు.

భక్తిశ్రద్ధలతో గోవిందనామ పారాయణం



గోవిందనామ పారాయణం చేస్తున్న మహిళలు

చాగలమర్రి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని చెన్నకేశవ ఆలయంలో మహిళలు సామూహికంగా గోవిందనామ, లలిత పారాయనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులకు, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అహోబిల లక్ష్మీ నరసింహస్వామి దీక్ష చేపట్టిన మాలదారులు నరసింహస్వామి, చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను పరామర్శించిన మంత్రి బీసీ



డోన్ ఎమ్మెల్యేను కలిసిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

డోన్ రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్‌రెడ్డిని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్నారు. హైదరాబాద్‌లోని కోట్ల జయ సూర్యప్రకాశ్‌రెడ్డి ఇంటిలో బీసీ కలుసుకొని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కోట్ల త్వరలో కోట్ల కోలుకోవాలని బీసీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, నాయకులు ఉన్నారు.

జగనన్న కాలనీలో కార్డెన్ సెర్చ్

● 16 బైకులు, మూడు ఆటోలు సీజ్



జగనన్న కాలనీలో సీజ్ చేసిన వాహనాలు

కోవెలకుంట్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల పట్టణంలోని జగనన్నకాలనీలో ఆదివారం తెల్లవారుజామున సీఐ హనుమంత నాయక్ ఆధ్వర్యంలో ఎస్ఐలు మల్లిఖార్జునరెడ్డి, రమణయ్య, భూపాలుడు, పోలీసు సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా 16 మోటారు బైకులు, మూడు ఆటోలు సరైన పత్రాలు లేకపోవడంతో గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కాలనీలో కొత్త వారికి ఇళ్లు బాడుగకు ఇచ్చేటప్పుడు అడ్రస్ కనుగొని పూర్త ఆధారాలు తెలుసుకోవాలన్నారు. అలాగే వాహనాలు కొనుగోలు చేసేటప్పుడు సర్టిఫికెట్లు లేదంటే కొనకూడదన్నారు. లేదంటే వాహనాలు సీజ్ చేయడంతో పాటు కొన్నవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ముఖ్యంగా మట్కా, పేకాట వంటి వాటిని నిర్వహిస్తుంటే పోలీసులకు తెలిపి వాటి నిర్మూలనకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదు

● రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు



సమావేశంలో పాల్గొన్న వైసీపీ నాయకులు

డోన్ రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు స్పష్టం చేశారు. ఆదివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్‌పై జరిగిన హత్యాయత్నం కేసును వైసీపీకి ఆపాదిస్తూ మాట్లాడడం సరికాదన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఐదేళ్ల తన పదవీ కాలంలో డోన్‌లో ఎటువంటి రాజకీయ ప్రత్యర్థులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడలేదన్నారు. డోన్ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పని చేసుకుంటూ వెళ్లారన్నారు. వైసీపీలో ఉన్న కోట్రికే హరికిషన్‌ను పార్టీలో సముచిత స్థానం కల్పించి ఆయన్ను గౌరవించిందన్నారు. ఆయన రాజకీయ ఎదుగుదల చూడలేక ఆయనపై హత్యాప్రయత్నం జరిగిందన్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. వైసీపీ ఎప్పటికీ హత్యారాజకీయాలను ప్రోత్సహించదని, అది నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునన్నారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు బద్దెల రాజ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, జిల్లా వాలంటరీ విభాగపు అధ్యక్షులు పోస్టు ప్రసాద్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, నాయకులు హనుమంతరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీ

ఉయ్యాలవాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇంజేడు గ్రామంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. వివరాలిలా.. ఆలయంలో ఉదయం అర్చకుడు రమణయ్య స్వామివారికి పూజ చేసి వెళ్లి తిరిగి సాయంత్రం రాగా ఆలయం తాళం తెరవబడి ఉన్నట్లు గమనించారన్నారు. తలుపులు తెరిచి చూడగా అందులోని శ్రీవారి వెండిపాదాలు, శఠగోపం, తీర్థపు పాత్ర, గంటె కనిపించలేదన్నారు. దీని విలువ వెండి అర్ధకేజీ పైబడి ఉంటుందని తెలిపారు. ఆలయ అర్చకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

బేతంచెర్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోర్లగుట్ట గ్రామానికి చెందిన బోయ నాగలక్ష్మి (39) అనే మహిళ కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రామచంద్రగౌడు ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన బోయ బాల పుల్లయ్య భార్య నాగలక్ష్మికి కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడేది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. మృతురాలికి కూతురు కుమార్తె ఉన్నారు. భర్త బోయ పాల పుల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

బేషరతుగా క్షమాపణ చెప్పాలి : ● సీపీఎం నాయకులు ● అమిత్‌షా గోబ్యాక్ అంటూ నిరసన



డోన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

డోన్ రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కోయలకొండ నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని బేతంచెర్ల రోడ్డులో అమిత్‌షా గోబ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ నిరసనను చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు చిన్న రెహిమాన్, శివరాం, నాగమద్దయ్య పాల్గొన్నారు.

బేతంచెర్ల: కేంద్ర మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బేతంచెర్ల పాతబస్టాండులో రాస్తారోకో నిర్వహించారు. ఆదివారం సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు రాష్ట్రానికి వస్తున్న అమిత్‌షా గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ డా.బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచేలా పార్లమెంటులో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



బేతంచెర్ల పాతబస్టాండులో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

అసంపూర్తిగా కస్తూర్బా ప్రహరీ పనులు

● 16 ఏళ్లుగా వీడని సమస్య ● చోద్యం చూస్తున్న అధికారులు



కస్తూర్బా పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న ప్రహరీ నిర్మాణం

చాగలమర్రి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల, జూనియర్ కళాశాల ప్రహరీ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పాఠశాల 2007లో ప్రారంభించారు. పాఠశాల భవనం ప్రహరీ పనులకు రూ.20 లక్షలు నిధులు కేటాయించారు. పాఠశాల ఇరుపక్కల ప్రహరీ పనులు పూర్తి చేసినప్పటికీ ముందు భాగాన పనులు మిగిలిపోయాయి. దీనివల్ల రక్షణ గేటు ఏర్పాటు చేయలేదు. 16 ఏళ్ల గడిచిన ప్రహరీ పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. దీంతో పాఠశాలకు రక్షణ కొరవడింది. పాఠశాలలో బాలికలు విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారు. సరైన సెక్యూరిటీ కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల పాఠశాలలో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే అఖిలప్రియ ముఖ్య అతిథిగా పాల్గొనడంతో ప్రిన్సిపాల్ సునీత పాఠశాల ప్రహరీ పనులు పూర్తి చేసి రక్షణ కల్పించాలని వినతి రూపంలో తెలియజేశారు. ఎమ్మెల్యే, రెవెన్యూ అధికారులు స్పందించి ప్రహరీ పనులను పూర్తి చేసేలా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా

ఏఈ షాజహాన్



చాగలమర్రి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్‌ను రెండు విడతలుగా కాకుండా తొమ్మిది గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామని విద్యుత్ శాఖ ఏఈ షాజహాన్ తెలిపారు. అలాగే గ్రామాల్లో కూడా 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో ఏఈ మాట్లాడారు.

ప్రశ్న: రోజుకు ఎన్నిగంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నారు?

జవాబు: ప్రతి రోజూ తొమ్మిది గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ఫీడర్ల పరిధిలో రైతులకు విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

ప్రశ్న: మండలంలో ఎన్ని విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ఉన్నాయి?

జవాబు: ఐదు సబ్‌స్టేషన్‌లు ఉన్నాయి. పెద్దబోదనం, ముత్యాలపాడు, చింతలచెరువు, గొడిగనూరు, చాగలమర్రి గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ఉన్నాయి.

ప్రశ్న: విద్యుత్ బకాయిలు ఎన్ని ఉన్నాయి?

జవాబు: మండలంలో విద్యుత్ బకాయిలు రూ.12 కోట్లు ఉండగా ఇటీవల రూ.3 కోట్లు రికవరీ చేశామని, ఇంకా రూ.9 కోట్లు బకాయిలు ఉన్నాయి.

ప్రశ్న: విద్యుత్ సిబ్బంది కొరత ఉందా?

జవాబు: విద్యుత్ సిబ్బంది కొరత ఉంది. ఖాళీల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదించాం.

ప్రశ్న: రైతులకు త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎన్నిరోజుల్లో ఇస్తారు?

జవాబు: రైతులు త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తు చేసుకుంటే త్వరలో ఇస్తాం. పరిశ్రమలు, గృహాలు, వ్యాపార సమూదాయాలకు తక్షణమే అందిస్తాం.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

కోవెలకుంట్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల మండలంలోని పలు గ్రామాల్లో నేటి నుంచి ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు బిజినవేముల పశువైద్యాధికారి క్రిష్ణకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం నుంచి ఈనెల 31 వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించి పశువులకు వైద్యచికిత్సలు, గర్భకోశ వ్యాధులు, నట్టల నివారణ మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, పశుపోషకులు పాల్గొనాలని కోరారు.

ప్యాపిలి: మండలంలో నేటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశుసంవర్ధకశాఖ ఏడీ కిశోర్‌కుమార్ ఆదివారం తెలిపారు. రైతులు, గొర్రెల కాపర్లు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీ కోరారు. సమావేశంలో పశువైద్యాధికారి విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

చాగలమర్రి: గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ, ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పశువైద్య శాల సహాయ సంచాలకులు వరప్రసాద్ తెలిపారు. పశువైద్యులతో కూడిన రెండు బృందాలు షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి పశువైద్యం అందించనున్నట్లు తెలిపారు.

23న మండల సర్వసభ్య సమావేశం

ప్యాపిలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 23న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస రావు ఆదివారం తెలిపారు. మండలంలోని వివిధ ప్రజా సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వశాఖల అధికారులు, ఎంపీటీసీ మెంబర్లు, సర్పంచులు సమావేశానికి తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

పోస్టర్ విడుదల

డోన్ రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): యురేకా సైన్స్ ఎక్స్‌పో-2025 కార్యక్రమంలో పాల్గొనాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి కోరారు. ఆదివారం పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాణిక్యం శెట్టి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రయోగ ఉన్నత పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెల 15వ తేదీలోపు సైన్స్ ప్రయోగాలకు సంబంధించి గూగుల్ ఫాం లింక్ ద్వారా వీడియోలను ఆసక్తిగల విద్యార్థులు పంపాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ధర్మ ప్రచారం అందరి బాధ్యత

చాగలమర్రి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ధర్మప్రచారం అందరి బాధ్యతని అభినవ శంకరానందస్వామి అన్నారు. ఆదివారం చాగలమర్రి పాత శివాలయంలో భజగోవిందం ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరు దైవమార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, హిందూ సంఘం ఎస్ఎస్ఎఫ్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

24న నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు

చాగలమర్రి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని బుగ్గవీధిలోని క్రీడా మైదానంలో ఈనెల 24న ఆళ్లగడ్డ నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అల్తాఫ్, రఫి ఆదివారం తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతి టీడీపీ నాయకులు అనిఫ్ రూ.20 వేలు, తౌహిద్, పేయింటర్ ముస్తాక్ రెండో బహుమతిగా రూ.10 వేలు, సలీమ్ రూ.5 వేలు నగదును మూడవ బహుమతిగా అందజేస్తారన్నారు. పోటీలో పాల్గొనే వారు ఈనెల 23 లోపు తమ టీమ్‌ల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంత్యక్రియలు

బేతంచెర్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల మండలం లోని గుళాయిల దగ్గర ఉన్న కాశిరెడ్డి నాయన ఆశ్రమం ప్రాంగణంలో కందనూలు వెంకటసుబ్బయ్య (70) అనే వృద్ధుడు శనివారం మృతి చెందాడు. ఆయనకు భార్య కూతురు ఉన్నారు. వారు మృతుడి అంత్యక్రియలు నిర్వహించమని ఆ నలుగురు స్వచ్ఛంద సంస్థ సభ్యులను కోరారు. స్పందించిన వారు హెచ్.కొట్టాల గ్రామ శ్మశాన వాటికలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు నాగేశ్వరరెడ్డి, లక్ష్మీరాఘవ, అక్బర్, వన్నూరుబాషా, డా. సద్దాం, షేక్షావలి, మధువిక్రమ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గంగమ్మ గుడికి సీసీ రోడ్డు

బేతంచెర్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామాపురం గ్రామంలోని గంగమ్మ గుడికి సీసీ రోడ్డు వేశారు. గుడికి సీసీ రోడ్డు లేక భక్తులు అవస్థలు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి రూ.10 లక్షలు మంజూరు చేయడంతో సీసీ రోడ్డు వేశారు. ఎమ్మెల్యే స్పందించి సమస్యను పరిష్కరించడం హర్షించదగ్గ విషయమని గంగపుత్ర సంఘం సభ్యులు అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

బనగానపల్లె, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన బనగానపల్లె మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కోవెలకుంట్ల పట్టణంలోని ఎస్ఎల్‌వీటీ టాకీస్ వద్ద దూదేకుల బాబు(41) అను వ్యక్తి లేడీస్ కార్నస్ దుకాణం పెట్టుకొని జీవించేవాడు. పని నిమిత్తం బనగానపల్లెకు వచ్చి తిరిగి కోవెలకుంట్లకు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన సిమెంట్ లారీ ఢీకొన్నది. దాంతో బాబు తల నుజ్జునుజ్జు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని బనగానపల్లె ఎస్ఐ దుగ్గిరెడ్డి నేతృత్వంలో పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.